ఆనందాల డోలిక.. వెలుగుల వేడుక

- నేడు దీపావళి
- లక్ష్మీదేవి పూజకు ఇళ్లలో, వ్యాపార సముదాయాల్లో సిద్ధం

కర్నూలు కల్చరల్/ నంద్యాల కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆనందాల డోలిక.. వెలుగుల వేడుక దీపావళి. ఇంటిల్లిపాది ఉత్సాహంగా జరుపుకునే సంబరం. ముచ్చటగా రెండు రోజుల పాటు సాగే ఈ వేడుకలో ఆదివారం నరక చతుర్దశిని నిర్వహించారు. సోమవారం దీపావళిని ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఏటా ఆశ్వయుజ అమావాస్య రోజున చీకట్లను పారదోలుతూ, లోకాన వెలుగులు నింపుతూ వేడుకను జరుపుకుంటారు. చెడుపై మంచి సాధించే విజయానికి ప్రతీకగా సంబరాలను నిర్వహించుకుంటారు. కొత్త పద్దులు సిద్ధం చేసుకొని, లక్ష్మీపూజలకు వ్యాపారులు సమాయత్తమవుతున్నారు. దీపావళికి నోములు నోచుకొనేందుకు సిద్ధమయ్యారు.

మిగతా 6వ పేజీలో

నేడు పీజీఆర్ఎస్ రద్దు : ఎస్పీ

నంద్యాల టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ సునీల్ షెరాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రభుత్వ సెలవు, దీపావళి పర్వదినం సందర్భంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు గమనించి రావద్దని కోరారు. అలాగే తిరిగి 27న జరిగే కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

ఆనందాల డోలిక.. వెలుగుల వేడుక

(5వ పేజీ తరువాయి)

'దీపేన సాధ్యతే సర్వం' అని శాస్త్ర వచనం. 'దీపంతో దేనినైనా సాధించొచ్చు'అని దీని సారాంశం. నిత్యం ఉదయం, సాయంత్రం సంధ్య వేళల్లో ఇంట్లో వెలిగించిన దీపాలు ఐశ్వర్యకారకంగా నిలుస్తాయని ధార్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏదైనా కోరిక తీరాలంటే ఒక దీపాన్ని వెలిగించి, ఫలం, పుష్పాలు సమర్పించి, ఇష్టదేవతకు నమస్కరిస్తే చాలని పురాణాలు పేర్కొంటాయి. దీపమున్న చోట దేవతలు నివసిస్తారని దీపావళి రోజున ఇళ్లల్లో దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని స్వాగతిస్తారు.

శ్రీమహాలక్ష్మికి ప్రీతికరమైన వేడుక

దీపావళి రోజు దీపలక్ష్మి తన కిరణాలతో అమావాస్య చీకట్లను పారదోలి, జగత్తును తేజోవంతం చేస్తుంది. అందుకే దీపావళి నాడు సర్వ శుభాలు, సంపదలు ప్రసాదించే లక్ష్మీదేవిని పూజించడం మన సంప్రదాయం. లక్ష్మీదేవి దీపజ్యోతిగా, జ్యోతిని లక్ష్మి మూర్తిగా భావించి దీపావళి రోజున దీపాలు వెలిగించాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

నరకాసురుడిని వధించిన సందర్భంగా..

లోక కంటకుడైన నరకాసురుడిని సత్యభామ వధించడం, ముల్లోకాలను గడగడలాడించిన లంకాధిపతి దశకంఠుడ్ని శ్రీరాముడు జయించిన సందర్భంగా ప్రజలు ఆనందంగా దీపాలు వెలిగిస్తూ, బాణసంచా కాలుస్తూ సంబరంగా దీపావళి వేడుక నిర్వహించారనేది పౌరాణిక ప్రాశస్త్యం. కౌరవులు సాగించిన మాయా జూదంలో ఓడిన పాండవులు పదమూడేళ్ల అరణ్యవాసం, ఏడాది అజ్ఞాత వాసం ముగించుకొని తమ రాజ్యానికి తిరిగి వచ్చిన సందర్భంగా దీపాలు వెలిగించి ప్రజలు దీపావళి జరుపుకొన్నారని భారతంలో ఉంది.

దీపావళికి ప్రాముఖ్యత ఉంది

దీపావళి పండుగకు వైజ్ఞానికంగా మానవ సమాజానికి మేలు చేసే ఎంతో ప్రాముఖ్యత ఉంది. అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి, జ్ఞానం అనే దీపాన్ని వెలిగించుకొని ప్రతి వ్యక్తి జీవితంలో ముందుకు పోవాలనే అర్థం ఇందులో ఉంది. ఈ వేడుకలో దీపాల అలంకరించడంతో వచ్చే వెలుగు మానసిక ఆనందాన్ని కలిగిస్తే, దీపాల వెలుగుతో పాటు బాణసంచా వెలుగుతో వచ్చే కాంతి మనసులో భయాలను దూరం చేస్తుంది.

● దేవెళ్ల సాయినాథ శర్మ, వేద పండితుడు

దుకాణాలు కిటకిటలాడుతున్నాయి

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో టపాసుల దుకాణాలు వెలిశాయి. కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఆనందాల దీపావళిని అప్రమత్తంగా జరుపుకోవాలని పలువురు అధికారులు, తదితరులు సూచిస్తున్నారు. టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

పండుగ పూట ప్రత్యేక రైళ్లు

మద్దికెర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంతకల్లు డివిజన్ మీదుగా సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగుళూరు కంటోన్మెంట్ నుంచి ఈ నెల 21, 22, 23 తేదీల్లో గుంతకల్ మీదుగా కలబురిగి, ముజఫర్‌నగర్‌కు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.





మరణంలోనూ వీడని బంధం

భార్య మృతితో ఆగిన భర్త గుండె


లక్ష్మీనారాయణ, వెంకటలక్ష్మమ్మ దంపతులు (ఫైల్)

ప్యాపిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడి వయసు 93ఏళ్లు.. వృద్ధురాలి వయసు 83 ఏళ్లు. వృద్ధాప్యంలో కూడా దంపతులిద్దరూ ఒకరికొకరు తోడుగా ఉంటూ జీవనం సాగించేవారు. వయస్సు మీద పడటంతో పాటు అనారోగ్యం తోడు కావడంతో భార్య మృతి చెందింది. భార్య మరణ వార్త విని భరించలేక భర్త కూడా మృతి చెందారు. ఈ విషాద ఘటన ఆదివారం నంద్యాల జిల్లా ప్యాపిలి పట్టణంలో జరిగింది. పట్టణానికి చెందిన ఆర్వేటి లక్ష్మీనారాయణ (93) గ్రంథాలయం అధికారిగా పనిచేసి 33 ఏళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. ఆయన భార్య వెంకటలక్ష్మమ్మ(83) గృహిణి. ఈదంపతులకు నలుగురు కుమారులున్నారు. వీరిలో ఇద్దరు కొడుకులు అనారోగ్యంతో మృతి చెందారు. ఒక కుమారుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నారు. పట్టణంలో ఉంటున్న మూడో కుమారుడు దగ్గర వృద్ధ దంపతులు ఉంటున్నారు.

వృద్ధ దంపతుల మరణంతో కుటుంబంలో విషాదం

లక్ష్మీనారాయణ అనారోగ్యంతో ఆరేళ్లుగా మంచానికే పరిమితమయ్యారు. దీంతో ఆయన బాగోగులను భార్య వెంకటలక్ష్మమ్మ చూసుకునేవారు. అయితే ఆమె కూడా కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిద్రలేపగా వృద్ధురాలు పలకలేదు. కుటుంబ సభ్యులు వైద్యులకు చూపించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య మరణ వార్తను తట్టుకోలేక వృద్ధుడు కూడా ఉదయం 10 గంటల సమయంలో ప్రాణాలు వదిలారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

కోవెలకుంట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. ఈఘటన అన్నమయ్య జిల్లా రాజంపేటలో చోటుచేసుకున్నట్లు బంధువులు తెలిపారు. వివరాలు.. మండలంలోని వెలగటూరు గ్రామానికి చెందిన మహీంద్రరెడ్డి (18) రాజంపేటలో బీటెక్ చదవుతున్నాడు. శనివారం కాలేజీ నుంచి హాస్టల్ కు బైకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి స్తంభానికి ఢీకొని కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. ఆదివారం మృతదేహాన్ని స్వగ్రామమైన వెలగటూరుకు తీసుకు వచ్చారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగారు.









ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

రాష్ట్ర మంత్రులు, కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళిని జిల్లా ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు దీపావళిని సురక్షితంగా చేసుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.





నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కౌలూరు

● ఎమ్మెల్యే గౌరు చరిత

● రైతు సేవా కేంద్రం, ఆరోగ్య కేంద్రం భవనాలు ప్రారంభం



రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కౌలూరు అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం కౌలూరులో రూ. 23 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, రూ. 22 లక్షలతో నిర్మించిన ఆరోగ్య కేంద్రం భవనాలను ఆమె ప్రారం భించారు. అనంతరం ఎంపీటీసీ సభ్యుడు నల్లల భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌలూరు గ్రామం అభివృద్ధి చెందడానికి మాజీ సమితి అధ్యక్షుడు నల్లల మునిశేషిరెడ్డి, నల్లల భాస్కరరెడ్డి చలవేనన్నారు. రెండుసార్లు కౌలూరు జాతీయ, రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ పంచాయతీ అవార్డుకు ఎంపికకావడం అధికారులు, పాలకుల పనితీరుకు నిదర్శమ న్నారు. కౌలూరులోని మోడల్ కాలనీ రహదారులకు ఇప్పటికే రూ. 20 లక్షలు ఇచ్చామని, మరో రూ. 20 లక్షలు త్వరలో మంజూరు చేస్తామన్నారు. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చే స్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊడల బాలయ్య, తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పీఆర్ డీఈ మోహన్‌రావు, ఎంపీటీసీ రంగరమేష్, నల్లల భాస్కరరెడ్డి, ఏఈ మహబూబ్‌బాషా, సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఏపీవో శేషన్న, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఏవో జయప్రకాష్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధన త్రయోదశి వేడుకలు


● అమ్మవారి నాణేల పంపిణీ

నంద్యాల కల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని నిమిషాంబ దేవాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ధనత్రయోదశి వేడుకలను నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం దసరా నుంచి ధనత్రయోదశి వరకు అమ్మవారి ప్రతిమ కలిగిన నాణేలకు పూజలు చేశారు. వీటిని అనంతవర్మ దంపతులు భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో సాయివర్మ, అశోక్, మాధవ, సురేష్, కుమార్, నాగరాజు, మురళి, సుధాకర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ మౌనం దేశానికి నష్టదాయకం

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు

నందికొట్కూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమెరికా విచ్చలవిడిగా సుంకాలు విధిస్తున్నా మోదీ మౌనం వహించడం నష్టదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయం ఆవరణలో ఇండియాపై అమెరికా విధించిన సుంకాలపై బుక్‌లెట్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అమెరికా నియంతృత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, నాగన్న, గోపాల్, మాసూం పాల్గొన్నారు.







నాయకుల దందా..!

● భారీ ఎత్తున వసూలు
● అయోమయంలో బాణసంచా వ్యాపారులు
● అధిక ధరలతో బురిడీ
● జిల్లా వ్యాప్తంగా 175 దుకాణాలు

నంద్యాల, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో కొందరు నాయకులు దందాకు తెరలేపారు. పట్టణంలో కొందరు నాయకులు కలిసి ఒక్కొక్క దుకాణం నుంచి దుకాణాల నిర్వాహణ పేరుతో రూ.47 వేలు వసూలు చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. పైగా ఆయా శాఖల అనుమతులు, అమ్యామ్యాలు మేమే చూసుకుంటాం..? అని హుకుం జారీచేసి వసూళ్లకు తెరలేపడం దుమారం రేపుతోంది. ఇందులో ఆయా శాఖ అధికారుల పాత్ర ఎంతో ఉందో? అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఏది ఏమైనా సదరు నాయకులు చెప్పినట్లుగా ఆయా శాఖల అధికారులు సైతం పనులు చేసి పెట్టడం గమనార్హం.

అనుమతి తప్పనిసరి

బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీసు, జీఎస్టీ, మున్సిపాలిటీ శాఖల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఈ ప్రకారంలో జిల్లా వ్యాప్తంగా 175 దుకాణాలకు ఆయా శాఖల నుంచి అనుమతి పొందినట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి. అధికార లెక్కల ప్రకారం. ఒక్కొక్క దుకాణానికి లైసెన్సు కోసం.. అగ్నిమాపక శాఖకు- రూ.500, రెవెన్యూ శాఖకు - రూ.500, జీఎస్టీ రూపంలో- అడ్వాన్సు ప్రాంతాల వారీగా--రూ. 6వేల నుంచి రూ.14వేలు వరకు. ఈ లెక్కన మొత్తంగా సుమారు రూ.20వేలు మాత్రమే ఖర్చు అవుతుందని సమాచారం. అధికార లెక్కల ప్రకారం.. జిల్లాలో నంద్యాల-71, శ్రీశైలం-10, ఆత్మకూరు-23,ఆళ్లగడ్డ-20, డోన్-17, బనగానపల్లె-34 చొప్పున మొత్తంగా 175 దుకాణాలకు అనుమతి పొందారు.





ఎస్పీజీ మైదానంలో టపాకాయల దుకాణాలు, టపాసులు కొని తీసుకెళ్తున్న పట్టణ ప్రజలు

ఏ పార్టీ అధికారంలో ఉంటే

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు కలిసి ఆయా దుకాణాల ఏర్పాటు పనులు చేసుకుని ఒక్కొక్క దుకాణం నుంచి ధర ఫిక్స్ చేసి వసూలు చేసి సొమ్ము చేసుకుంటారు. ఈక్రమంలో తాజాగా కూడా అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు కలిసి నంద్యాలలో అనుమతి పొందిన 71 దుకాణాల వ్యాపారుల నుంచి ఒక్కో షాపు నుంచి రూ. 47,000 చొప్పున మొత్తంగా రూ.33.37లక్షలు వసూ చేశారని తెలిసింది.

టపాసులు ఇవ్వాలని షరతు

ఒక్కో షాపునకు రూ.47వేలు వసూలు చేయడంతో పాటు.. ఆయా శాఖలతో పాటు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులకు టపాసులివ్వాలని షరతు సదరు నాయకులు విధించారని తెలిసింది. దీంతో ఆలస్యంగా లైసెన్సులు ఇచ్చారని ఆవేదన చెందారు. మొత్తంగా నాయకులు.. అధికారుల తీరుతో ఆయా వ్యాపారుల్లో ఆమయోమయం చెందాల్సిన దుస్థితి. టపాసుల అనుమతుల రూపంలో నాయకులు.. కొందరు అధికారులకు కాసుల వర్షం కురిపించినట్లైంది.

అధిక ధరలకు విక్రయించి..

నాయకుల దందా.. అధికారులు చేతివాటంతో విసిగిపోపోయిన పలు దుకాణదారులు సైతం తమదైన శైలిలో టపాసులను జీఎస్టీ సాకులతో అధిక ధరలకు విక్రయించి క్యాష్ చేసుకుంటున్నారు. ఈక్రమంలో ప్రజలకు టపాసుల రూపంలో జేబులకు చిల్లుపడి నట్లైంది. ఇదే క్రమంలో టపాసుల వ్యాపారాల సమయంలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అధికారులు సైతం నిద్రమత్తులో ఉండటం పలు విమర్శలకు తావిస్తోంది.

పేలుతున్న ధరలు

నంద్యాల కల్చరల్ : బాణసంచా ధరలు పేలుతున్నాయి. దీపావళి వైభవమంతా బాణ సంచాలోనే ఉంది. పిల్లలు, పెద్దలు అంతా బాణసంచా కాల్చడానికి పండుగ కోసం ఎదురు చూస్తారు. ఈసారి బాణసంచా ధరలు ఆకాశంలో ఉన్నాయి. తారాజువ్వలు, భూచక్రాలు, టపాకాయల ధరలు భారీగా పెరిగాయి. చిన్నారులు కాకరపువ్వులను చిట్టిచేతుల్లో పట్టుకొని గిరాగిరా తిప్పుతుంటే ఆనందించే తల్లితండ్రులు బాణసంచా ధరలతో బెంబేలెత్తి పోతున్నారు. రూ.2000 పెట్టినా చేతికి సరిపడే బాణసంచా వచ్చేలాలేదు.

జీఎస్టీ 2.0 సంస్కరణలపై విస్తృత అవగాహన

- డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జీఎస్టీ 2.0 (సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్) సంస్కరణలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించామని, దీని కోసం నెలరోజుల కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్, నోడల్ అధికారి మురళీ మనోహర్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జీఎస్టీ 2.0 (ఉత్సవ్) అవగాహన కార్యక్రమాల ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్ల బత్తుల కార్తీక్ మార్గదర్శకత్వంలో జిల్లాలోని అన్ని విభాగాల సహకారంతో జీఎస్టీ 2.0 అవగాహన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగం చేసుకొని ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. జీఎస్టీ సంస్కరణలు వ్యాపారులు, వినియోగదారుల మధ్య సులభమైన పన్ను విధానం పారదర్శకతను తీసుకురావడమే లక్ష్యమన్నారు. జీఎస్టీ స్లాబ్‌ల గురించి పూర్తిగా వివరించామన్నారు. మొదటివారం మెప్మా, గ్రామ సచివాలయ సిబ్బందితో, రెండోవారం వ్యవసాయ అనుబంధ శాఖలతో, మూడో వారం మున్సిపల్, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమ శాఖల సిబ్బందితో, నాల్గోవారం టూరిజం, రవాణా, విద్యుత్ శాఖల సిబ్బందితో గ్రామసభలు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత సులభమైన సేవలు అందించేందుకు హెల్ప్‌లైన్, సలహా డెస్కులు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలు చేస్తున్న జీఎస్టీ విధానం వల్ల ప్రజలకు లాభాలు కలుగుతున్నాయన్నారు. అంతకుముందు డీఈవో ఆధ్వర్యంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, జీఎస్టీ అంశం ప్రదర్శనలు జరిగాయి.



మాట్లాడుతున్న మురళీమనోహర్

మెడికల్ కళాశాలకు 16 పీజీ సీట్లు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మెడికల్ కళాశాలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ 16పీజీ సీట్లను మంజూరు చేసింది. కళాశాలలో జనరల్ మెడిసిన్ 4, జనరల్ సర్జన్ 4, అనస్థీషియా 4, అబ్స్ట్రెక్టిస్ట్ అండ్ గైనకాలజి 4చొప్పున పీజీ సీట్లను మం జూరు చేసింది. ఈ మేరకు కళాశాల ఎన్ఎంసీ ఉత్తర్వులు జారీ చేసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● మూడు రోజుల కిందటే కూతురు పెళ్లి

నంద్యాల టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం సుగాలి తాండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహానంది మండలం బోల్లవరం గ్రామానికి చెందిన హుసేన్‌బాషా (45) బైక్‌పై నంద్యాలకు వస్తుండగా సుగాలితాండ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నది. దాంతో హుసేన్ బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న బైక్‌లో బుక్కాపురం గ్రామానికి చెందిన అక్క తమ్ముడు సువార్తమ్మ, మల్లేష్‌కు గాయాలయ్యాయి. అయితే మృతుడు గత మూడు రోజుల క్రితమే కూతురు వివాహం చేశాడు. దీంతో పెళ్లి ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వై.రామపక్కీర్‌రెడ్డి సూచించారు. నంద్యాల పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జగన్ ఆర్థో హాస్పిటల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు, రిటైర్డ్ పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ అపోలో హాస్పిటల్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎల్.కిరణ్ కుమార్‌రెడ్డి, కేన్స్ హాస్పిటల్ ఎండీ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎ.సౌమర్యారెడ్డి, డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డి వైద్యసేవలు అందించారన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.వి.భాస్కర్‌రెడ్డి, ఎంఈవోలు మోహన్‌రెడ్డి, విజయకుమార్, ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాసులు, పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ విజేత రామకృష్ణ డిగ్రీ కళాశాల

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్ కాలేజియట్ షటిల్‌బాడ్మింటన్ టోర్నమెంట్‌లో రామకృష్ణ డిగ్రీ కళాశాల జట్టు విజేతలుగా నిలిచాయి. ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, డీన్ ప్రగతిరెడ్డి, స్పోర్ట్స్ అడ్వయిజరీ బోర్డు సెక్రటరీ కేవీ శివకిశోర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ శ్రీనివాస్, ఉస్మానియా కళాశాల పీడీ ప్రకాష్, నాగార్జున, ఇద్రూస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా: మాజీ ఎమ్మెల్యే

మిడుతూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): నాపరాతిగనుల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం నాగలూటి గ్రామంలో దామగట్ల, బ్రాహ్మణకొట్కూరు, మిడుతూరు, పీరుసాహేబ్ పేట, నాగలూటి తదితర గ్రామాల నాపరాతి గని కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వసూలు చేస్తున్న రాయల్టీని వెంటనే నిలిపివేయాలన్నారు. నాపరాతి గనుల్లో పని చేస్తున్న నిరుపేద గని కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. రాయల్టీ కారణంగా గనులు మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయాన్ని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి, ఎంపీ బైరెడ్డి శబరి ద్వారా తీసుకెళ్తానన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

పోలూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000-2001 పదోతరగతి బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీవీ ప్రసాద్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శేషశయనరెడ్డి, రమణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వ ఉపాధ్యాయులు

ఆయుర్వేద ఔషధాలకు ప్రాచుర్యం కల్పించాలి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద ఔషధాలకు మరింత ప్రాచుర్యం కల్పించాలని వక్తలు అన్నారు. ధన్వంతరి, దీపావళిని పురస్కరించుకొని ఆదివారం నంద్యాల మిడ్‌టౌన్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ధన్వంతరి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు కేశవమూర్తి, చిన్నపరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా నందీశ్వరునికి డమరుకాల వితరణ

మహానంది, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలోని ప్రధాన ఆలయాల్లో ఉపయోగించేందుకు రెండు ఎలక్ట్రానిక్ డమరుకాలను దాతలు అందజేసినట్లు వేదపండితులు చందూరి రవిశంకర్ అవధాని తెలిపారు. ఆదివారం యాగశాల మంటపంలో దాతలు మండలంలోని గోపవరం దుర్గా మల్లికార్జునరెడ్డి, మాధవి అందజేశారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

నంద్యాల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పట్టణ పౌర సంఘాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ బాబురావు కోరారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లాలోని ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

విద్యుదాఘాతంతో వాచర్ మృతి

పాములపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ ప్రొటెక్షన్ వాచర్ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని భానుముక్కల, బనకచెర్ల గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్నట్లు ఆదివారం ఆత్మకూరు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాలు.. వెలుగోడు పట్టణంలోని జమ్మితండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్(55) అటవీ శాఖలో వాచర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి అటవీ పందులను వేటాడేందుకు కొందరు గుర్తు తెలియని వేటగాళ్లు విద్యుత్ స్తంభం నుంచి కొంతదూరం కరెంటు తీగలు ఏర్పాటు చేసి చిన్నచిన్న కర్రలు అక్కడ ఉంచి కనెక్షన్ ఇచ్చారు. రాత్రి విధి నిర్వహణలో ఉన్న వాచర్ రోడ్డు పక్కన నిలిపిఉన్న మోటారు సైకిల్‌ను చూసి అటవీ ప్రాంతంలోకి వెతుకుతూ వెళ్లాడు. జంతువుల వేటకోసం ఏర్పాటుచేసిన కరెంటుకు జే వైరుకు కాలుకు తగిలింది. తోటి సిబ్బంది అప్రమత్తమై కర్రల సహాయంతో వైరును తొలగించారు. చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అటవీశాఖ అధికారులు, పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దించి ఆ ప్రాంతమంతా వేటగాళ్ల కోసం గాలించారు. కరెంటు తగిలి రెండు నక్కలు కూడా మృతి చెందాయని, వాటికి పంచనామా నిర్వహించనున్నట్లు అటవీ శాఖాధికారులు తెలిపారు. ఘటనాస్థలిలో ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బంగారు ఆభరణాల అపహరణ

నంద్యాల టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో ఒక వృద్ధురాలును బెదిరించి మూడుతులాలు బంగారు అభరణాలు అపహరించిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితురాలు ఇందిరమ్మ, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పెద్ద బండ దగ్గర ఉన్న నీలివీధికి చెందిన వృద్ధురాలు ఇందిరమ్మ ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా గుర్తు తెలియని మహిళ మాస్కు వేసుకుని వచ్చింది. కత్తి చూపించి బెదిరించి, దాడి చేసి ఒంటిపై ఉన్న మూడు తులాల బంగారు అభరణాలు అపహరించి వెళ్లిపోయింది. గాయపడిన వృద్ధురాలును నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. దీంతో వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంతకాల సేకరణ

పగిడ్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కేంద్రంలో వైసీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త దారా సుదీర్ హాజరయ్యారు. సర్పంచ్ శేషన్న, జడ్పీటీసీ పుల్యాల దివ్య, వైసీపీ నాయ కులు రమేష్ నాయుడు, పాలూరి వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులున్నారు.

సామ్రాజ్యవాద పన్నుల విధానం ప్రమాదం

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద విస్తరణలో భాగంగా ద్వితీయ ప్రపంచ దేశాలను తన మాట వినేలా చేసుకోవడం కోసం భారీ సుంకాలు వేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పూనుకున్నారని బేతంచెర్ల ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాస్ అన్నారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో నంద్యాల జిల్లా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ అధ్యక్షతన స్టడీ సర్కిల్ సమావేశం నిర్వహించారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పన్నుల విధానం భారతదేశంపై దాని ప్రభావం' అనే అంశంపై ప్రిన్సిపాల్ మరియదాస్ మాట్లాడారు. ట్రంప్ ఆలోచనా విధానం ప్రమాదకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు రామకృష్ణుడు, నరసింహారెడ్డి, అరవింద్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జునప్ప, సోమన్న, బాలస్వామి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్ మృతి తీరని లోటు

నంద్యాల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్సీ , హజ్ కమిటీ చైర్మన్ హజ్రత్ మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ మృతి ముస్లిం సమాజానికి తీరని లోటు అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక, రాజకీయ రంగాలలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. షబ్బీర్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు, ఆయన అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పూజా సామగ్రి పంపిణీ

కొత్తపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాలకు దానధర్మ హైదరాబాదు చారిటబుల్ ట్రస్టు పూజా సామగ్రిని పంపిణీ చేసింది. ఆదివారం మండలంలోని శివపురం గ్రామశివారులోని కాలభైరవ నిత్యాన్నదాన సత్రం నిర్వాహకుడు నాగార్జున గౌడు పర్యవేక్షణలో ప్రమిదలు, అగరబత్తీలు, కర్పూరం అందజేశారు.

సీఎం నిర్ణయంపై హర్షం

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం చంద్రబాబు నిర్ణయంపై ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసీ ఉసేన్‌రెడ్డి, కార్యదర్శి ఎల్.నరసారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నంద్యాల జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.

'ఓర్వలేకే విమర్శలు'

కొలిమిగుండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకవస్తూ, రాష్ట్ర యువతలో తనదైన ముద్ర వేస్తోంటే ఓర్వలేకే వైసీపీ విమర్శలు చేస్తోందని టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంకిరెడ్డిపల్లెలో ఆయన మాట్లాడుతూ నూతన రాష్ట్ర చరిత్రలో వైజాగ్‌లో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఓ చారిత్రాత్మకమైనదని, దీనిపై కూడా ప్రతిపక్షాలు విమర్శలు చేయడం బాధాకరమని అన్నారు.

విచారణ చేపట్టిన డీఎస్పీ

దొర్నిపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు గ్రామంలో ఆదివారం డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఉద్యోగాల పేరుతో మోసగించిన బాసిరెడ్డి, వీరారెడ్డికి చెందిన కుటుంబ సభ్యుల ఇళ్లలో, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. త్వరలో బాసిరెడ్డి వీరారెడ్డి, రాజారెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలను అరెస్టు చేసి నష్టపోయిన బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇంకా ఎవరైనా నష్టపోయిన బాధితులు ఉంటే వారి వివరాలతో పోలీసు స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో సీఐలు మురళీధర్‌రెడ్డి, హనుమంతనాయక్, ఎస్ఐలు వరప్రసాద్, రామిరెడ్డి, దొర్నిపాడు ఏఎస్ఐ రామయ్య ఉన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

బేతంచెర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రౌడీషీటర్లు ప్రజాశాంతికి భంగం కలిగించినా, అల్లర్లు సృష్టించినా చర్యలు తప్పవని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అల్లర్లకు పాల్పడకుండా ప్రజలతో కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నాయకుల దందా..!

- భారీ ఎత్తున వసూలు
- అయోమయంలో బాణసంచావ్యాపారులు
- అధిక ధరలతో బురిడీ
- జిల్లా వ్యాప్తంగా 175 దుకాణాలు
- నిద్రమత్తులో అధికారులు

నంద్యాల, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో కొందరు నాయకులు దందాకు తెరలేపారు. పట్టణంలో కొందరు నాయకులు కలిసి ఒక్కొక్క దుకాణం నుంచి నిర్వాహణ పేరుతో రూ.47 వేలు వసూలు చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. పైగా ఆయా శాఖల అనుమతులు, అమ్యామ్యాలు మేమే చూసుకుంటాం..? అని హుకుం జారీ చేసి వసూళ్లకు పాల్పడటం దుమారం రేపుతోంది. ఇందులో ఆయా శాఖ అధికారుల పాత్ర ఎంతో ఉందో? అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఏది ఏమైనా సదరు నాయకులు చెప్పినట్లుగా ఆయా శాఖల అధికారులు సైతం పనులు చేసి పెట్టడం గమనార్హం.

అనుమతి తప్పనిసరి

బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీసు, జీఎస్టీ, మున్సిపాలిటీ శాఖల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఈ ప్రకారంలో జిల్లా వ్యాప్తంగా 175 దుకాణాలకు ఆయా శాఖల నుంచి అనుమతి పొందినట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి. ఒక్కో దుకాణానికి లైసెన్సు కోసం.. అగ్నిమాపక శాఖకు- రూ.500, రెవెన్యూ శాఖకు రూ.500, జీఎస్టీ రూపంలో- అడ్వాన్సు ప్రాంతాల వారీగా రూ. 6వేల నుంచి రూ.14 వేలు వరకు. ఈ లెక్కన మొత్తంగా సుమారు రూ.20వేలు మాత్రమే ఖర్చు అవుతుందని సమాచారం. అధికార లెక్కల ప్రకారం.. జిల్లాలో నంద్యాల-71, శ్రీశైలం-10, ఆత్మకూరు-23, ఆళ్లగడ్డ- 20, డోన్-17, బనగానపల్లె-34 చొప్పున మొత్తంగా 175 దుకాణాలకు అనుమతి పొందారు.



ఏ పార్టీ అధికారంలో ఉంటే

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు కలిసి ఆయా దుకాణాల ఏర్పాటు పనులు చేసుకుని ఒక్కొక్క దుకాణం నుంచి ధర ఫిక్స్ చేసి వసూలు చేసి సొమ్ము చేసుకుంటారు. ఈ క్రమంలో తాజాగా కూడా అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు కలిసి నంద్యాలలో అనుమతి పొందిన 71 దుకాణాల వ్యాపారుల నుంచి ఒక్కో షాపు నుంచి రూ. 47,000 చొప్పున మొత్తంగా రూ.33.37లక్షలు వసూ చేశారని తెలిసింది.

బాణసంచా ఇవ్వాలని షరతు

ఒక్కో షాపునకు రూ.47వేలు వసూలు చేయడంతో పాటు.. ఆయా శాఖలతో పాటు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులకు బాణసంచా ఇవ్వాలని షరతు సదరు నాయకులు విధించారని తెలిసింది. దీంతో ఆలస్యంగా లైసెన్సులు ఇచ్చారని ఆవేదన చెందారు. మొత్తంగా నాయకులు.. అధికారుల తీరుతో ఆయా వ్యాపారుల్లో ఆయోమయం తలెత్తే దుస్థితి. బాణసంచా అనుమతుల రూపంలో నాయకులు.. కొందరు అధికారులకు కాసుల వర్షం కురిపించినట్లైంది.

అధిక ధరలకు విక్రయించి..

నాయకుల దందా.. అధికారులు చేతివాటంతో విసిగిపోయిన పలు దుకాణదారులు సైతం తమదైన శైలిలో బాణసంచాను జీఎస్టీ సాకుతో అధిక ధరలకు విక్రయించి క్యాష్ చేసుకుంటున్నారు. ఈక్రమంలో ప్రజలకు బాణసంచా రూపంలో జేబులకు చిల్లుపడినట్లైంది. ఇదే క్రమంలో బాణసంచా వ్యాపారాల సమయంలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అధికారులు సైతం నిద్రమత్తులో ఉండటం పలు విమర్శలకు తావిస్తోంది.

పేలుతున్న ధరలు

నంద్యాల కల్చరల్ /కొలిమిగుండ్ల, ఆంధ్రజ్యోతి: టపాసుల ధరలు పేలుతున్నాయి. దీపావళి వైభవమంతా బాణ సంచాలోనే ఉంది. పిల్లలు, పెద్దలు అంతా బాణసంచా కాల్చడానికి పండుగ కోసం ఎదురు చూస్తారు. ఈసారి బాణసంచా ధరలు ఆకాశంలో ఉన్నాయి. తారాజువ్వలు, భూచక్రాలు, టపాకాయల ధరలు భారీగా పెరిగాయి. చిన్నారులు కాకరపువ్వులను చిట్టిచేతుల్లో పట్టుకొని గిరాగిరా తిప్పుతుంటే ఆనందించే తల్లితండ్రులు బాణసంచా ధరలతో బెంబేలెత్తి పోతున్నారు. రూ.2000 పెట్టినా చేతికి సరిపడే బాణసంచా వచ్చేలాలేదు.

యాగంటి కార్తీకమాస బుక్‌లెట్ విడుదల



యాగంటి కార్తీక మహోత్సవాల బుక్‌లెట్ విడుదల చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో ఈనెల 22 నుంచి నిర్వహించే ఉమామహేశ్వరస్వామి కార్తీక మహోత్సవాల బుక్‌లెట్‌ను ఆదివారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆవిష్కరించారు. 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కార్తీక మాస మహోత్సవాలు నవంబరు 20వతేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. నవంబరు 5న కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ యాగంటి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, తమిళనాడు నుంచి కూడా సుదూర ప్రాంతాల నుంచి శివభక్తులు వస్తారని వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్తీక మహోత్సవ ఏర్పాట్లను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ వార్షిక ఆదాయం పెంచేందుకు ఏసీ ఎంతో కృషి చేయడంతో పాటు లడ్డూ ప్రసాదంలో నాణ్యతను పెంచి భక్తులకు అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డిని చంద్రమౌళీశ్వరరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమాలో యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, బాలతిమ్మారెడ్డి, టీఎస్ఆర్‌రెడ్డి, సిబ్బంది ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ తెలుగు పండిట్ అవార్డు గ్రహీతకు సన్మానం



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత లక్ష్మయ్యను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

చాగలమర్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బాలికోన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మయ్య రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీతగా ఎంపికైనందుకు ఆదివారం పీఆర్టీయూ కార్యాలయంలో ఆ సంఘ నాయకులు శాలువ, పూలమాలతో సత్కరించి అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకోవడం అభినందనీయమని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవీంద్రారెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు మౌలాలి, అంజనేయరెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి అవార్డు కూడా అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు సుబ్బరాయుడు, నారాయణమూర్తి, రవిప్రకాష్‌రెడ్డి, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

డోన్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజున టపాకాయలు పాటించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి రంగస్వామి గౌడు అన్నారు. ఆదివారం అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చిన్నారులు పెద్దల సమక్షంలో పర్యవేక్షణలో టపాసులు కాల్చేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాకెట్లు, పటాసులు కాల్చేటప్పుడు ధరించిన దుస్తుల మీద పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. గుడిసెలు, గడ్డివాములు, పెట్రోల్ బంకులకు దూరంగా టపాసులు కాల్చాలని సూచించారు.

బేతంచెర్ల: దీపావళి సందర్భంగా బేతంచెర్ల పట్టణంలో పోలీసు మైదానంలో ఏర్పాటు చేసిన క్రాకర్స్ షాపులను ఆదివారం షాపులను సీఐ వెంకటేశ్వరరావు పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించి క్రాకర్స్ విక్రయిస్తేచర్యలు తప్పవన్నారు. షాపుల వద్ద నీళ్ల డ్రములతో పాటు ఇసుక వంటి బకెట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేనిచో లైసెన్సులు ద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు..

డీఏ ప్రకటనపై హర్షం

డోన్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు దీపావళీ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల డోన్ ఏపీఎన్జీవోసలు, ఏపీ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీవోస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దీపావళి ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రితో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో జరిగిన స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన హుందాతన చర్చలు దాదాపు 5 సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో జరగడం సంతోషదాయకమన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందనాన్ని నింపిందన్నారు. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆసుపత్రుల్లో చికిత్స పరిమితిని రూ.50వేల నుంచి రూ.1లక్ష వరకు పెంచడం ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నేరుగా ట్రస్టు ఖాతాలో జమ అయ్యేలా చూడటం సంతోషమన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు ఎండీ షమీవుల్లా, అసోసియేట్ అధ్యక్షులు బి.కోదండ రామయ్య, సెక్రటరీ కే.పురుషోత్తంరెడ్డి, జాయింట్ సెక్రటరీ మనోహర్ రెడ్డి, కోశాధికారి రఫీ, వెటర్నరీ అసిస్టెంట్, ఉపాధ్యక్షులు ఈ.వెంకటేశ్వర్లు, రంగస్వామి, రవి, చంద్ర, గౌరి, ఉమెన్ జాయింట్ సెక్రటరీ శైలజ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



నల్లమేకలపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి అండగా ఉంటామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లమేకలపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయకులు వెంకటరాముడు కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఏ కష్టం వచ్చిన తనను సంప్రదించాలని మృతుడి కుటుంబానికి కోరారు. అనంతరం ఆయన మండలంలోని వా ల్మీకి గృహాలను సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు వై లక్ష్మీనారాయణయాదవ్, రాజశేఖర్‌నాయుడు, టి శ్రీనివాసులు, సుదర్శన్, రామాంజినేయులు, రాంపురం నాగేశ్వరరావు, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

డోన్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డోన్ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు, మండల అధ్యక్షుడు దశరథరామిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ డోన్ మండల ప్రజలకు ఎల్లపుడూ అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి తోడ్పడుతామని పేర్కొన్నారు. తమపై ఎంతో నమ్మకం ఉంచి పట్టణ, మండల అధ్యక్ష పదవులకు ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రె డ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గూగుల్ సంస్థ మన రాష్ట్రానికి తీసుకురావడనికి కృషి చేసిన మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు గోసానిపల్లె శ్రీరాములు, యాపదిన్నె రంగన్న, ఎర్రగుంట్ల నారాయణ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ కేంద్రం పరిశీలన

డోన్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం గుత్తి రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయ కేంద్రాలను డీఎస్పీ శ్రీనివాసులు ఆదివారం రాత్రి పరిశీలించారు. బాణాసంచా కోసం కొనుగోలుకు వచ్చే వారు అగ్గిపెట్టెలు, లైటర్లు ఉంచుకోరాదని ఈ సందర్భంగా డీఎస్పీ కొనుగోలుదారులకు సూచించారు. అదే విదంగా రాత్రి సమయంలో కొనుగోలుకు వచ్చే వారు ఇబ్బంది పడకుండా మార్కెట్ యార్డు రాత్రి ప్రత్యేక లైట్లను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డీఎస్పీవెంట పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఉన్నారు.

దుస్తుల పంపిణీ

బేతంచెర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన మండల సహకార సంఘం సొసైటీ ఛైర్మన్ ఉన్నం చంద్రశేఖర్ తన సొంత ఖర్చులతో క్రికెట్ క్రీడాకారులకు రూ.15వేలు విలువ చేసే దుస్తులు పంపిణీ చేశారు. విద్యతోపాటు క్రీడాకారులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. క్రికెట్‌లో మంచి ప్రతిభ కనబరిచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కొలుములపల్లె మాజీ సర్పంచ్ శేషశైనారెడ్డి, నాగరాజు, రమేష్, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.